నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ విఠల్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మసీదులో ముస్లిములకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ముస్లిములతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గణపతి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ, సముద్రాల రాజన్న, సదాశివ్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.



కుల బహిష్కరణ కేసులో ఆరుగురికి నెల జైలు శిక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుల బహిష్కరణ కేసులో ఆరుగురికి నెల రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి సోమవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం..నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి చెందిన తీగల ఎడన్న ఆస్తి వివాదంలో ఉంది. ఈ విషయమై కుల పెద్దలు పంచాయతీ నిర్వహించి 2019లో కుల బహిష్కరణ చేశారు. బాధితుడు నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టి సాక్షులను ప్రవేశపెట్టి కుల బహిష్కరణకు పాల్పడిన ఆరుగురికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు నిచ్చారు.

వడదెబ్బ నుండి కాపాడుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- జిల్లా అధికారుతో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా గురయ్యే వడదెబ్బ నుండి కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్‌రాజ్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ కిషన్, బీసీ అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి వడదెబ్బ నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైన వారిని రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అనుబంధ శాఖలు, ఐసిడిఎస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వారికి తీవ్రమైన శరీరక ఉష్ణోగ్రత, తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షికంగా, పూర్తిగా రోగి అపస్మారక స్థితికి చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. వడదెబ్బ తగలకుండా చల్లని నీడ ప్రదేశంలో ఉండాలని, ఉష్ణోగ్రత అతిగా ఉన్నప్పుడు గొడుగు ఉపయోగించాలని, తెల్లని వదులు దుస్తులు ధరించాలని, తలపై టోపీ, రుమాలు ధరించాలని, ఎండలో తేలికైన పనులు చేయాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, నీరు తాగాలని, ఓఆర్ఎస్ తాగాలని తెలిపారు.

ప్రాథమిక చికిత్స అందించి వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. జిల్లాలో 74వేల350 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో, ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 100 ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాలు, 650 మంది ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఉప జిల్లా వైద్యాధికారులు డా.సుధాకర్‌నాయక్, డా.ఎస్.అనిత, డా.సీతారామరాజు, డా.అనిల్, ఎపిడమలిస్ట్ సుమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలి



నవతెలంగాణ-నస్పూర్

భూగర్భ, ఉపరితల గనులలో రక్షణ నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని కార్పొరేట్ జనరల్ మేనేజర్(సేఫ్టీ) చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) రఘుకుమార్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై కూలంకషంగా చర్చించారు. భూగర్భ, ఉపరితల గనులలో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు తప్పనిసరిగా రక్షణ నియమాలు పాటిస్తూ, వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించాలని, ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి డిజిఎంఎస్ నియమ నిబంధనలకు లోబడి పని చేస్తూ వ్యక్తిగత రక్షణ కలిగి ఉండి, ఎటువంటి ప్రమాదం సంభవించకుండా తగు జాగ్రత్త చర్యలను పాటిస్తూ ఉండాలని, వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులు వారివారి వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించాలని, సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను ఎల్లవేళలా ఉద్యోగులకు అధికారులు తెలియజేస్తూ వారివారి పనులలో నిష్ణాతులను చేయాలని సూచించారు. ప్రమాదరహిత సింగరేణిగా చేయడానికి కావలసిన అన్ని రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు శ్రీనివాస్, ఏవి.రెడ్డి, ఏజెంట్లు కె రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు రామకృష్ణరావు, నాగరాజు, సీహెచ్‌పీ డీజీఎం చంద్రలింగం పాల్గొన్నారు.

50 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాపలో రూ.1.25లక్షల విలువ గల 50 కిలోల నకిలీ విడి పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు దేవాపూర్ పోలీస్‌స్టేషన్లో సీఐ, ఎస్ఐ ఆంజనేయులతో కలిసి నిందితుల అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలపై దేవాపూర్ పోలీసులకు సమాచారం అందడంతో మండల వ్యవసాయ అధికారితో కలిసి కొండాపూర్ గ్రామంలోని గుడిమల్ల చంద్రయ్య ఇంటిలో సోదాలు చేశారు. రెండు సంచుల్లో ప్రభుత్వం నిషేధించిన 50కిలోల నకిలీ విడి పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయని చంద్రయ్యను విచారించారు. కిష్టంపేట్ గ్రామస్తుడైన కూనారపు బాలకృష్ణ వ్యవసాయం చేస్తే అధిక ఆదాయం రావడం లేదని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తెలిసిన రైతులను నమ్మించి నకిలీ విత్తనాలు అమ్మి డబ్బులు సంపాదించాలని ప్లాన్ వేసుకున్నాడు. ఈ మేరకు 11 తేదీన మందమర్రికి చెందిన జానీ, ముల్కాల సుధీర్, గోవిందుల శంకర్‌ను కలిశాడు. నిర్మల్ జిల్లాకు చెందిన వ్యక్తి పత్తి విత్తనాలు పంపించాడని చెప్పగా కిలో రూ.2000 చొప్పున 50 కిలోల కొనుగోలు చేశాడు. చంద్రయ్య, బాలకృష్ణ గోవిందుల శంకర్ ఆటోలో కొండాపూర్‌లోని చంద్రయ్య ఇంటికి తీసుకొచ్చి వాటిని రూ.2500కు తెలిసిన రైతులకు అమ్మాలని నిర్ణయించుకున్నారు. సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు గుడిమల్ల చంద్రయ్య, కిష్టంపేటకు చెందిన కూనారపు బాలకృష్ణ, మందమర్రి శ్రీపతినగర్‌కు చెందిన మొహ్మద్ సాహెబ్ జానీ, ముల్కాల సుధీర్, ఫస్ట్ జోన్‌కు చెందిన గోవిందుల శంకర్‌పై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పొలాలకు దారి ఇవ్వకుండా లేఅవుట్‌లు వేస్తున్నారని పొన్నారి గ్రామ రైతులు నందు తదితరులు సోమవారం ప్రజావాణిలో వినతి అందించి, కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొన్నారి నుంచి సావర్‌గాం శివారులో ఉన్న పొలాలకు ఎడ్లబండి దారి ఉందన్నారు. కానీ ఇప్పుడు ఆ దారి గుండా లేఅవుట్ కారణంగా తమకు దారి లేకుండా పోయిందన్నారు. ఇదే విషయమైన అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వ నక్షలో దారి లేదని చెబుతున్నారన్నారు. ఎడ్లబండి దారి నక్షలో ఎలా కనిపిస్తుందన్నారు. కలెక్టర్‌తో పాటు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోందన్నారు. మరో రెండు మూడు నెలల్లో వర్షాలు ప్రారంభమవుతాయని, దారి లేక పోవడంతో వ్యవసాయం ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని దారి ఇవ్వాలని కోరారు. కార్యకమంలో రైతులు శ్రీవర్ధన్, ఇంతియాజ్, లింగన్న, బసా ఆశన్న, ఆనంద్, రాములు, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

గ్లైపోసెట్ వాడకం పర్యావరణానికి హాని

- మంచిర్యాల్ డీసీపీ భాస్కర్
- 247 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ అనుమతిలేని బోల్‌గార్డ్-3 విత్తనాలు వాడి గ్లైపోసెట్ రసాయనాన్ని పిచికారి చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని మంచిర్యాల్ డీసీపీ భాస్కర్ తెలిపారు. అచలాపూర్ వద్ద ప్రభుత్వ అనుమతులు అని పత్తి విత్తనాలు పట్టుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చలాపూర్-గోపాల్‌నగర్ మధ్యలో సన్యాసి మఠం వద్ద డీసీఎం వ్యాన్‌లో నుండి కారులో నకిలీ పత్తి విత్తనాలను డంపు చేస్తున్నారని సమాచారంతో ఎస్సై కిరణ్ కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేశారు. డీసీఎం వ్యాన్‌లో 247 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వీటిని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. సరఫరా చేస్తున్న ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల సూత్రధారి పరారీలో ఉన్నాడు. నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, పరిసర ప్రాంత పంటల్లో దిగుబడును తగ్గుతాయని డీసీపీ తెలిపారు. పంట, పశుగ్రాసాన్ని పశువులు వేయడం వల్ల పాల ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశాలుని తెలిపారు. పర్యావరణంపై ప్రేమ గల వ్యక్తులు సామాజిక సంస్థలు గ్లైపోసెట్ రసాయనం, విత్తనాల అమ్మకాలను నిరోధించేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాల వ్యాపారం చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. విలేకరుఉల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సిఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపించి మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్, పక్కన ఏసీపీ, సీఐ, ఎస్ఐ

ప్రజా సమస్యలు పరిష్కరించాలని

కలెక్టర్ పీఏకు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 డిసెంబర్ 2024 నుండి కలెక్టర్ కార్యాలయం ముందర లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ నరసింహనగర్ తండాకు చెందిన గిరిజన రైతు జాదవ్ మోతీరామ్ రిలే నిరాహార దీక్ష నేటికీ కొనసాగుతోందని తెలిపారు. నిరసనలో భాగంగా ఇటీవల కుటుంబ సభ్యులు పొర్లుదండాలతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారని పేర్కొన్నారు. కానీ కలెక్టర్ ఆ సమస్యను పరిష్కరించలేదన్నారు. సంవత్సరం క్రితం ఖానాపూర్ సిడిపిఓ అవినీతిపై విచారణ జరిపి నేటికి బహిర్గతం చేయలేదన్నారు. దస్తురాబాద్ మండలంలోని రిటైర్డ్ ఉపాధ్యాయుడు చుంచు వెంకన్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 1000కి పైగా వికలాంగులకు నకిలీ సర్టిఫికెట్స్ ఇప్పించాడని తెలిపారు. పెన్షన్ పొందుతున్న వారి పెన్షన్లు రద్దు చేయాలని కోరుతూ రెండు సార్లు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చినా అధికారులు ఉలుకుపలుకు లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించని ఎడల కలెక్టర్, అధికారుల వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాస్ కాపీయింగ్ లేకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని పదవ తరగతి పరీక్షలను మాస్ కాపీయింగ్ లేకుండా నిర్వహించాలని జిల్లా పరిశీలకుడు టి.శ్రీనివాస్, డీఈఓ రామారావు అన్నారు. సోమవారం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎటువంటి కాపీయింగ్ జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. ఇన్విజిలేటర్‌లు తప్పకుండా ఐడి కార్డ్స్ ధరించాలని, సెల్‌ఫోన్‌లు తీసుకురావద్దని, ఇతరులెవరికీ ప్రవేశం కల్పించవద్దని సూచించారు. ఇన్విజిలేటర్‌లు ఓఎంఆర్‌లను జాగ్రత్తగా చెక్ చేసుకోవాలన్నారు. సరైన విద్యార్థులను గుర్తించి ఎవరి ఓఎంఆర్‌లను వారికి ఇవ్వాలని సూచించారు. పరీక్షల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఆంగ్ల భాష పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 9100కి 9089 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రైవేట్ రాసిన ఇద్దరిలో ఒకరు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని డీఈఓ రామారావు తెలిపారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆస్పత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఇందులో వైద్యులు సుదర్శన దేవి, సూపర్‌వైజర్ సురేష్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, అజీబ్‌ఖాన్, మానస పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని గురునానక్ ఫంక్షన్‌హాల్లో సోమవారం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లంపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా చీకటి తిరుపతి, ఉపాధ్యక్షులుగా భైరం లింగన్న, సుద్దపల్లి వేణుగోపాల్, కోశాధికారిగా మేడి భానుచందర్, ప్రచార కార్యదర్శులుగా ఖాదీర్ ఖాన్, బోరె రమేష్, కట్ల శంకర్, సంయుక్త కార్యదర్శులుగా పెండెం రాజశేఖర్, ఫయాజోద్దీన్, శ్రీనివాస్ చీకటి సాయి కిరణ్, కోనేటి రాజు, సభ్యులుగా ఏనుముల తిరుపతి, మధు చారి, కోల సత్యం, తొగరు రాజుతో పాటు మరో పది మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు కొండపర్తి ప్రసన్న కుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. పభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పని చేయాలని, ప్రజా సమస్యలతో పాటు జర్నలిస్టుల ఐక్యతకు, హక్కుల రక్షణకు కృషి చేయాలని దిశా, నిర్దేశం చేశారు.

జై బాపు-జై భీమ్-జై సంవిధాన్‌పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోయే జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్ కార్యక్రమంపై సోమవారం నాయకులు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అధ్యక్షత వహించి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఏఐసీసీ రూపొందించిన 20 నిమిషాల నిడివి గల వీడియోను నాయకులు, కార్యకర్తలకు చూపించారు. ముఖ్యఅతిథిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అమ్దాన్, నిర్మల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ అఫ్సర్ యూసుఫ్ జాహి, ఖానాపూర్, ముథోల్ కో ఆర్డినేటర్ రాంభూపాల్, రుద్ర భాస్కర్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతోందని, దీంతో 145 కోట్ల మంది ప్రజలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రపై గ్రామ గ్రామాన తిరుగుతూ వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, ఆనంద్‌రావు పాటిల్, అబ్దుల్ హాది, పడిగెల భూషణ్, ఆలయ కమిటీ చైర్మన్ గంగోని బూరజ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన, మహిళా, సేవాదళ్ నాయకులు కృష్ణవేణి అల్లూరి, ఎంబడి రాజేశ్వర్ పాల్గొన్నారు.



క్షయ వ్యాధి నిర్మూలనకు పటిష్ట చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీని అంతం చేద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 5 ట్రీట్మెంట్ యూనిట్లను మంచిర్యాల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి, చెన్నూర్‌లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,278 కేసులను గుర్తించి 871 మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నెలకు రూ.1000 చొప్పున పౌష్టికాహారం కోసం నిక్షయ్ పోషణ్ యోజన కింద ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 671 మందికి సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని, వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, తరువాత సకాలంలో మందులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నిర్మూలనపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధి నివారణలో ఉత్తమ సేవలు అందించిన 22 మంది వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.హరీష్‌రాజ్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, ఎస్సీ, బీసీ అభివృద్ధి అధికారులు రవీందర్‌రెడ్డి, పురుషోత్తంనాయక్, డీఆర్‌డీఓ కిషన్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఆర్ఎంఓలు భీష్మ శ్రీధర్, ప్రోగ్రామ్ అధికారి సుధాకర్‌నాయక్, ఉప జిల్లా వైద్యాధికారి డా.ఎస్.అనిత, డా.సీతారామరాజు, డా.ప్రసాద్, డా. కోటేశ్వర్‌రావు, డా.అనిల్, డా.హరిశ్చంద్రారెడ్డి, టిబి సమన్వయకర్త సురేందర్, డిపిఓ ప్రశాంతి, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఈదురుగాలులతో కూడిన వర్షం

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని కల్లెడ గ్రామంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి సుమారు 150 ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

తాగునీరు అందించండి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతపూర్ గ్రామంలో తాగునీరు సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం మాజీ ఎంపీపీ పంద్ర



జైవంత్‌రావు గ్రామానికి వెళ్లి నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాండ్ పంపు నుంచి మురుగు నీరు వస్తుంటే అధికారులు పటించుకోవడం లేదని అన్నారు. వెంటనే హ్యాండ్ పంపును శుద్ధి చేసి గ్రామ ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలు సేకరించారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గీతారాణి మాట్లాడుతూ విధుల్లో నిమగ్నమై ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య బృందాని అటవీ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇందులో డీఆర్ఓలు సిద్ధార్థ, ప్రకాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అలరించిన కొమ్ము కోయ నృత్యం




నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం మధ్యప్రదేశ్ రాష్ఙంలో సంపద సంహరో అనే కార్యక్రమంలో కొమ్ము కోయ నృత్యంతో అలరించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆదివాసీ కళాకారుడు ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పశ్చిమారి అనే పర్యాటక గ్రామంలో మూడు రోజులు పాటు నిర్వహించిన సంపద సంహరో అనే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తరపున ఆదివాసీ నృత్యాన్ని ప్రదర్శించడానికి చక్కని అవకాశం లభించిందనీ మా కొమ్ము కోయ నృత్యంతో అందరిని అలరించి మెప్పించామని అన్నారు. పర్యాటక స్థలాలను సందర్శించి చక్కని అనుభూతిని పొందామని ఈ అవకాశాన్ని కల్పించిన డైరెక్టర్ డీర్ ధర్మేంద్ర, పారే రాజీవ్ పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు రామకృష్ణ పిడుగయ్య, అయోధ్య రామయ్య, సత్తయ్య, అనిత, వనిత, సునీత, ప్రీతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- రిమ్స్‌లో టీబీ దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్షయ వ్యాధిని పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు కూడా దీనిపై అవగాహన పెంచుకోవాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్ ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వైద్య విద్యార్థులకు టీబీ వ్యాప్తి, నివారణ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చికిత్స విదానాలను ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అంతకు ముందు విద్యార్థులు రంగోళి, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందన్నారు. సరైన అవగాహన లేక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. టీబీని 2030 నాటికి పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలో ఉందన్నారు. రిమ్స్ తరపున రెండు రోజుల క్రితం గ్రామాల్లో వైద్య విద్యార్థులు పర్యటించి టీబీ గురించి అవగాహన కల్పించారని తెలిపారు. టీబీపై వంద రోజుల అవగాహన, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్స్‌రేలు తీస్తున్నారని వివరించారు. మూడు వారాల కంటే ఎక్కువగా దగ్గు, జ్వరం ఉంటే పరీక్షలు చేసుకోవాలని, రిమ్స్‌లో అన్ని రకాల పరీక్షలున్నాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, వైద్యులు సందీప్ జాదవ్, విద్యా విల్సాస్, మేడికోలు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



నవతెలంగాణ-తాంసి

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరుడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డప్పు చప్పులతో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, సీనియర్ నాయకులు తరుడి అరుణ్ కుమార్, వినయ్ సాగర్ హజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ నేతృత్వంలో 30 ఏండ్ల అలుపెరుగని పోరాటంతో ఎస్సీ వర్గీకరణ సాధించడం గర్వించ దగ్గ విషయమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దాసరి అశోక్, తరుడి శంకర్, అడెల్లు, మంగళారపు అశోక్, కుంటాల మహేష్, తరుడి కిరణ్ కుమార్, కుంటాల రవి, ఆలాలి నిఖిల్, పెంటపర్తి నర్సింగ్, ఉశన్న, గుమ్మడి శ్రీకాంత్, పెంటపర్తి స్వామి, గుమ్మడి చిట్టి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ యూత్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షులు అరికెలా పరమేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకుల కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.50 వేల నుంచి ఐదు లక్షల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సాయాన్ని అందించడానికి గొప్ప అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, నిసార్, భీమన్న, భాగ్యలక్ష్మీ, రాజేష్, ఉమేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని అధికారులకు మొర

నవతెలంగాణ-తాంసి

నిరుపేద కుటుంబానికి చెందిన ఓ కుటుంబం తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్ట్ ప్రజావాణి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్ర బహిరంగ విచారణ వేదిక కార్యక్రమంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ తమ గోడును సంబంధిత అధికారులకు విన్నవించారు. వివరాల్లోకి వెళితే పాలోడి గ్రామానికి చెందిన నిరుపేద కొమ్ముల రాధాకు గత కొన్ని సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 102/12 లో 2 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చి పట్టా కూడ ఇచ్చింది. ఆ భూమిని దున్నుకుంటూ వృద్ధ దంపతులు జీవనం కొనసాగిస్తున్నారు. వ్యవసాయం చేసుకుంటున్న తరుణంలో రాధకు అనారోగ్యం కారణంగా వ్యవసాయం చేయలేకపోయారు. వ్యవసాయ భూమి బిడుగా ఉందన్న కారణంతో రెవెన్యూ అధికారులు మరో వ్యక్తికి ఆ భూమిని కేటాయించారు. ఆ విషయం మొదట పట్టా పొందిన వ్యక్తికి తెలువకపోవడంతో ఆ పంట పొలానికి ఈ దంపతులు వెళ్లగా మరో వ్యక్తి ఆ చేనును దున్నుకుంటున్నాడు. ఒక్కసారిగా ఆందోళన చెంది రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరిగిన ఎటువంటి ప్రయోజనం కలుగలేదు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పైలెట్ ప్రజావాణి కార్యక్రమంలో తమ గోడును వివరిస్తూ కన్నీటి పర్యాంతమయ్యారు. తమకు కేటాయించిన భూమిని మరో వ్యక్తికి కేటాయించడంతో తమకు అన్యాయం చేశారని మాకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య శరణ్యమని అధికారులకు వేడుకొన్నారు. సంబంధిత అధికారుల తప్పిదంతోనే మరో వ్యక్తికి ఆ భూమిని కేటాయించారని అన్నారు. మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



అధికారుల ముందు తమ గోడును వెళ్లబోసుకుంటున్న బాధిత మహిళ

హామీలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి

- బడ్జెట్ ప్రతులు దహనం చేసిన దివ్యాంగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో దివ్యాంగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు నగేష్ అన్నారు. బడ్జెట్‌లో వికలాంగులకు సరైన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం బస్టాండ్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.6 వేలు ఇస్తామని, ఆరు గ్యారెంటీల్లో ఐదు శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల జరిగిన బడ్జెట్‌లో వాటి ప్రస్తవ కూడా తీసుకురాలేదన్నారు. నిధులు కూడా కేటాయించలేదని మండిపడ్డారు. దివ్యాంగులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తు సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్ ఆరు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశన్న పాల్గొన్నారు.

ఆరో రోజు సీసీఐ దీక్షలో బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో సీసీఐ పునరుద్ధరణ కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన "రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరుకోగా ఆదిలాబాద్‌రూరల్ మండల బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలను కో - కన్వీనర్ విజ్జగిరి నారాయణ, బండి దత్తాత్రి, అరుణ్ కుమార్, లోకారి పోశెట్టి, బొల్లు ఈశ్వర్ దాస్, జగన్‌సింగ్ పూలదండలు వేసి దీక్ష ప్రారంభించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం సీసీఐ ప్రారంభానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో గంద్రత్ రమేష్, సెవ్వ జగదీష్, వెంకటరమణ, అప్కం గంగయ్య, ఆరీఫ్, రాసం వినోద్, పొచ్చన్న, అఖిలేష్, గడ్డం శ్రీను, మోతిరామ్, శ్రీనివాస్, ప్రమోద్, నవీన్, భగవాండ్లు, అజిత్, మాధవ్, లచ్చన్న, కాంతరావు, పెందోర్ గంగారాం, సుదర్శన్ ఉన్నారు.

సైబర్ క్రైమ్ జరిగితే 1930కి డయల్ చేయాలి

- బాధిత రైతులకు నగదు జమ
- ఎస్పీకి రైతుల సన్మానం



ఎస్పీని సన్మానించిన రైతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి సైబర్ క్రైమ్ చోటు చేసుకున్న వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గత సంవత్సరం పోస్ట్ ఆఫీస్‌లో రైతుల ఖాతాలోని డబ్బులను తన సొంత ఖాతాలోకి మళ్లించిన ఒక ఉద్యోగితో మొదలైన బాధితులలో, మిగిలిపోయిన ఆరుగురికి నేడు తమ డబ్బులు తిరిగి తమ ఖాతాల్లో జమ అయ్యాయి. దీనికి కృషి చేసిన ఎస్పీని సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించి ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల డబ్బులు తిరిగి వచ్చేందుకు జిల్లా ఎస్పీ సైబర్ క్రైమ్ డీఎస్పీతో దేశ రాజధాని ఢిల్లీకి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. భీంపూర్‌కు చెందిన మోహన్‌కు రూ.లక్ష, తంతోలికి చెందిన నక్కల జగదీష్‌కు రెండు లక్షలు, చించుఘాట్‌కు చెందిన నాగుబాయికి రూ.లక్ష 30 వేలు, అర్లికి చెందిన ఆశమ్మకు రూ. 86 వేలు, జలాల వెంకటి, జగదాంబ ఫెర్టిలైజర్స్ వారి డబ్బులు తిరిగి వారి ఖాతాల్లోకి జమ అయినట్లు తెలియజేశారు. రైతుల డబ్బులు తిరిగి రావడానికి కృషి చేసిన జిల్లా ఎస్పీకి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, సిబ్బంది ఏసుదాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆదిలాబాద్ నుంచి సీఐటీయూ నాయకులు లింగాల చిన్నాన్న పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కోడిగుడ్డుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులు రాజకీయ వేధింపులు అరికట్టాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం పని భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఐటీడీఏ ఏఓ దామోదరస్వామి అర్జీలను స్వీకరించారు. అనంతరం గిరిజనులు తెలిపిన సమస్యలపై అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోని గిరిజన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఓ అగస్టిన్, పీవీటీజీ ఏపీఓ మెస్రం మనోహర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో సమ్మె శిబిరాల వద్దకు వచ్చి హామిలిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని అన్నారు. అద్దె, గుడ్డు బిల్లులు చెల్లించడం లేదన్నారు. టూ జీ ఫోన్లు ఇచ్చి రిపోర్టులను పెట్టమంటే ఎలా సాధ్యమౌతుందన్నారు. 5జీ ఫోన్ లేదా ట్యాబ్‌లను అందించాలని డిమాండ్ చేశారు. ఒంటి పూట బడులు, వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సమ్మెబాట చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు శోభ, వందన, సంగీత, చాయ, లలిత, భాగ్య, గంగాసాగర పాల్గొన్నారు.

ఎన్ఆర్‌హెచ్‌సీ జిల్లా చైర్మెన్‌గా రాథోడ్ జితేందర్

నవతెలంగాణ-నార్నూర్

నేషనల్ హ్యూమన్ రైట్ కమిటీ ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా చైర్మెన్‌గా మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ జితేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం మీడియాతో మాట్లాడారు. సమస్యను వెలికి తీసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. చైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర చైర్మెన్ బడ్డిపడిగ శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డ్రాయింగ్‌లో చంద్రశేఖర్‌కు ప్రథమ బహుమతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ఓ ప్రయివేటు ఇంటర్నేషనల్ స్కూల్‌లో పేరెంట్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ విభాగంలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గాదరి చంద్రశేఖర్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే వివిధ పోటీలలో గెలుపొందిన వారికి స్కూలు యాజమాన్యం ట్రోఫీతో పాటు ప్రశంస పత్రాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా తన చిన్నతనం నుంచి డ్రాయింగ్ పట్ల ఉన్న నైపుణ్యాన్ని గుర్తు చేసుకుంటూ, మిత్రులు శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పైలెట్ ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-తాంసి

పైలేట్ ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రిసైడింగ్, జిల్లా ప్రణాళికాధికారి వెంకటరమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. మండలంలో 64 మంది తమ సమస్యలపై ప్రజావాణి సమాచార సహయ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోగా విచారణకు 23 మంది హజరై తమ సమస్యలని వినిపించారు. ఆరుగురి సమస్యలను బహిరంగ విచారణలో పరిష్కారం చేసినట్లు ప్రజావాణి ప్రిసైడింగ్ జిల్లా ప్రణాళిక అధికారి బి.వెంకటరమణ తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద నలుగురు విచారణకు హజరుకాగా, పూర్తి స్థాయి ఆదాయ, కుటుంబ నిర్ధారణ ధృవికరణ పత్రాలు సమర్పిస్తె పథకాన్ని మంజూరు చేస్తామని తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. తమ తల్లి, తండ్రి మరణించారని తమను అదుకోవాలని పాలొడి గ్రామానికి చెందిన అక్షయ్ విన్నవించారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ అన్ని ధృవీకరణ పత్రాలు అందజేస్తే, ఎన్ఎస్‌బీఎస్ పథకాన్ని మంజూరు చేస్తామన్నారు. కప్పర్ల గ్రామానికి చెందిన రైతు పిషారాం మాట్లాడుతూ తన బార్య చనిపోయినందున పీఎం కిసాన్ తనకు మంజూరు చేయాలని కోరారు. తమ పంట పొలాలలో విద్యుత్ వైర్లు కిందికి వంగి వెళాడుతూ ప్రమాదకరంగా మారాయని విద్యుత్ వైర్లు తొలగించాలని కోరగా, విద్యుత్ ఏఈ స్పందిస్తూ ఎస్టిమెంట్లు వేసి తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, పౌర సరఫరాల శాఖ అధికారులు పౌర సంస్థల ప్రతినిధులు పి.శంకర్, రమాకాంత్, రాకేష్, షారూక్, పులి కల్పన, శ్వేత, ఏఓ రవీందర్, సిహెచ్.రాజేందర్, వేణు బెంగుళూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు అభిశేక్, వికాస్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 8 మంది ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో సోమవారం టీఎస్ కేసీ (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్) ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు స్పందనలభించింది. ఈ జాబ్ మేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 35 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 8 మంది అభ్యర్థులను ఎంపికయ్యారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఎక్కడ అవకాశం వచ్చిన సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జె సంగీత, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. ఈ జాబ్ మేళాలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగ్‌రామ్ అంతర్వేది, టీఎస్‌కేసీ మెంటార్ ఎండి. ఇమ్రాన్ అలీ, హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ వినయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షకు 33 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగుతోంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా, సిబ్బంది వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. కాగా సోమవారం జరిగిన పరీక్షకు 10,042 మంది విద్యార్థులకు గాను, 10,009 మంది విద్యార్థులు హాజరై 33 మంది గైర్హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తులు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి..

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులను వాటి పరిష్కారం కోసం ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సమస్యలు పరిష్కరించాలని అతిథి అధ్యాపకులు కోరారు. సోమవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. ప్రస్తుతం ఎంత మంది వవస్థలో ఉన్నారు, ఎంత మంది డిస్ట్రబ్ అయ్యారనే విషయాలను ఎమ్మెల్సీ తెలుసుకున్నారని సంఘం నాయకులు తెలిపారు. అథితి అధ్యాపకుల వ్యవస్థ యధవిధిగా కొనసాగించేల చూడాలని కోరారు. నూతన మండలాలు అయిన చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్‌లో నూతన కళాశాలల ఏర్పాటు చేయాలని విన్నవించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు మారుతి, మనోహర్, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరించాలి

- అసెంబ్లీలో సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఎండాకాలం వచ్చిందంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోడు భూముల రైతులకు భయాందోళన మొదలవుతుందని, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పలు సమస్యలను ప్రస్తావించారు. 50 సంవత్సరాల నుంచి ఉమ్మడి జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, ఫారెస్ట్ అధికారులు ఊర్ల మీద పడి పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు పత్తి కట్టే తీసే సమయానికి ఫారెస్ట్ అధికారులు కందకాలు తవ్వుతున్నారని, దీని వలన పోడు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 10 సంవత్సరాలు చాలా ఇబ్బందులకు గురై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఒరవడిని కొనసాగిస్తుందని, రెవెన్యూ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ మధ్యల జాయింట్ సర్వే నిర్వహించక మా భూములు అంటే మా భూములు అని లాక్కుంటున్నారన్నారు. ఫారెస్ట్ అధికారుల అత్యుత్సాహంపై మంత్రి చొరవ తీసుకోవాలని, పోలీసులు మరచిపోయిన థర్డ్ డిగ్రీని ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై ఉపయోగించడం దారుణమని, వందలాది టేకు చెట్లను స్మగ్లర్లు నరికి తీసుకెళ్తుంటే కనీసం వారిపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పోడు రైతులను ఇంతగా ఇబ్బందులకు గురి చేస్తుంటే సీనియర్ ఫారెస్ట్ అధికారులు కనీసం మందలించడం లేదన్నారు. సీనియర్ ఫారెస్ట్ అధికారులు హైదరాబాద్‌లో ఉంటూ ఫీల్డ్‌కు రావడం లేదని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కర్జెల్లి రేంజ్‌లో 600 టేకు చెట్లు నరికితే డీఎఫ్ఓ, పీసీసీఎఫ్‌కు ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు లేవన్నారు. ఫారెస్ట్ అధికారులు ఒక మాఫియా లాగా నడిపిస్తున్నారని విమర్శించారు. 40 సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్డుకు ఇప్పుడు రినవల్ చేద్దామన్న, బోరింగ్లు, కరెంట్, సీసీ రోడ్లు వేయనియకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తమ ప్రాంతం వెనకబడిన నెట్టివేయబడిన ప్రాంతం కాబట్టి మంత్రి పోడు భూములకు స్పష్టమైన హామీ ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

జమిలీతో ఆర్థిక లాభం చేకూరుతుంది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో జమిలి ఎన్నికలతో ఆర్థిక లాభం చేకూరడంతో పాటు సమయం ఆదా అవుతుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశానికి సినీ నిర్మాత నాగబాల సురేష్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల దేశానికి ఆర్థిక నష్టం జరగదని, పాలనాపరంగా ఎక్కువ సమయం కేటాయించవచ్చని తెలిపారు. మాటిమాటికి ఎన్నికలంటే జనాలు కూడా ఉత్సాహం చూపరని, దానివల్ల ఓటింగ్ శాతం తగ్గి సరైన నాయకులు రావడం లేదని తెలిపారు. నాగబాల సురేష్ కుమార్ మాట్లాడుతూ మేధావులు, విశ్రాంత ఉద్యోగులు దేశ భవిష్యత్తు దృష్ట్యా ఈవిషయాన్ని సమాజంలోకి తీసుకుపోవాలని కోరారు. ఈ సమావేశం విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాగౌడ్, యూనిట్ అధ్యక్షులు రమేశ్, కోశాధికారి లింగయ్య, రామారావు, వెంకన్న, బాల శ్రీరాములు, సుగుణాకర్, కనకమ్మ వేంకటేశ్వర్లు, మహమూద్, మధుసూదన్ గౌడ్, వినోద్, సిడాం సూరు, హన్మంతు, విమల, వరలక్ష్మి సత్తెమ్మ, శ్యాంరావు, మధూకర్, భీమయ్య, వెంకటయ్య వెంకటేశం, నర్సయ్య, రామస్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో ప్రతి మంగవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు. మంగళవారం కంటి పరీక్షలో ఎంపికైన క్యటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణ, భోజనం సదుపాయం కల్పించి ఈ 8 మందికి ఆపరేషన్ కోసం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా డా.కొత్తపల్లి శ్రీనివాస్, డా.కొత్తపల్లి అనిత మాట్లాడుతూ 9 సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్ చేయించికొని లబ్ది పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి తైబాజార్ వేలం



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి అంజద్ పాషా ఆధ్వర్యంలో సోమవారం తైబజార్ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో నలుగురు ఔత్సహికులు పాల్గొన్నారు. రాథోడ్ సాగర్ రూ.291000కు అత్యధికంగా వేలం పాడి తైబాజార్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబర్ వెంకన్న పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- డీఎంహెచ్ఓ సీతారాం
- ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం



ఆసిఫాబాద్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ సీతారాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ ప్రోగ్రాం అధికారి అజీమొద్దీన్ అధ్యక్షతన ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి జిల్లా వైద్యాధికారి సీతారాం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ టీబీ సోకినట్లు అనుమానంగా ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిక్షయ్ పోషణ యోజన కింద చికిత్స పూర్తయ్యే వరకు రూ.6000 చొప్పున అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో టీబీని గుర్తించడానికి ఒకటి సిబినాట్, 2 ట్రూ నాట్ యంత్రాలున్నాయని తెలిపారు. వీటితో పాటు తిర్యాణి, కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మరో రెండు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలో 2024లో 13477టెస్ట్ చేసి 989, 2025లో 2863 టెస్టులకు 209 కేసులను గుర్తించడం జరిగిందని, ప్రస్తుతం 546 చికిత్స కొనసాగుతున్న కేసులున్నాయని, 2024 సంవత్సరంలో 409 మందికి రూ.8,56,500 నగదు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీబీ జిల్లా ప్రొగ్రాం కోఆర్డినేటర్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఉప్రే వినయ్, రిషిత ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, తెమడా, తెమడలో రక్తం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలుంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఒకవేళ క్షయ వ్యాధి అని పాజిటివ్ వచ్చినా ఆరు నెలలు ఉచిత మందులతో పాటు నిస్తాయ్ యోజన పథకం క్రింద రూ.వేయ్యి ఖాతాలో జమచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రిషిత, ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వాంకిడి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఆనంద్ కుమార్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ముంజం ఆనంద్ కుమార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఆనంద్‌కుమార్ డిమాండ్ చేవారు. సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ 6 వారాల నుంచి ఉపాధి కూలీ డబ్బులు చెల్లించడం లేదని, రోజుకు కూలీ రూ.100-150 మించి రావడం లేదని, పనిచేసే చోట టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని, తట్టలు, పార పనిముట్లు అందించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు రూ.600 ఇవ్వాలన్నారు. ఎండలో పనులు చేస్తున్న గిట్టుబాటు కూలీ ఇవ్వడం లేదని, కూలీ డబ్బులు పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు సైతం మూడు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, పార, పనిముట్లను ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు వారం లోపల కూలీ ఇవ్వాలని చట్టంలో పొందుపరిచిన కూలీ డబ్బులు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్ వేతనాలు మూలంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కూలీలకు రావాల్సిన డబ్బులను చెల్లించాలని అన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు, యజమానులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి భోజన వసతితో పాటు వీడియో గ్రాఫర్, వాహన సదుపాయాలు కల్పించిన వారికి బిల్లులు రాకపోవడంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు సిబ్బందికి భోజన వసతి, వాహనాల ఏర్పాటు, వీడియో గ్రాఫర్స్ లాంటివి ఏర్పాటు చేశామన్నారు. అయితే అధికారులు బిల్లులు చెల్లింపులు మాత్రం తాత్సారం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి జగదాంబ మెస్ రూ.18 లక్షలు, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గం సంబంధించి వీడియో గ్రాఫర్లకు రూ.33 లక్షలు, గురు ప్రసాద్ ఆటోమొబైల్స్ రూ.17 లక్షలు, వి ట్రావెల్స్‌కు రూ.ఐదు లక్షలు, హోం కంప్యూటర్‌కు రూ.9.5 లక్షలు, సిరి ఫ్లెక్స్‌కు రూ.ఐదు లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికలు జరిగి సంవత్సరాలు గడుస్తున్న తమకు నిధులు విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. రోజువారి వాటిపైన ఆధారపడి జీవిస్తున్న తమకు అధికారుల తీరు ఇబ్బందిగా మారిందన్నారు. గతంలో ఎలక్షన్ కమిషన్ అధికారులు జిల్లాకు వచ్చినప్పుడు వారి దృష్టికి కూడా తీసుకువెళ్లామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జిల్లా స్థాయి అధికారుల సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే కుటుంబంతో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో ఎన్నికలకు సంబంధించిన నిధులు విడుదల కాగా ఆసిఫాబాద్, పెద్దపెల్లి, జగిత్యాల జిల్లాకు చెందినవి మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జగదాంబ హోటల్ నిర్వాహకుడు సుదర్శన్, ఫోటోగ్రాఫర్ రాజు, వాహన యజమాని సోను, బకాయిలు ఉన్న యజమానులు పాల్గొన్నారు.

అప్పారి వెంకటస్వామికి ఘన నివాళి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

టీఎస్ యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. సోమవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ఉద్యమ పితామహుడు అప్పారి వెంకటస్వామి జీవితం నేటి నాయకులు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని తెలిపారు. సంఘం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. సంఘం కోసం తన 18 సంవత్సరాల సర్వీసును త్యాగం చేసి ప్రభుత్వ విద్య బలోపేతం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, సంఘ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. నిబద్ధత, ఆర్థిక క్రమశిక్షణ, నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి రాజ్ కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటస్వామి ఆశయ సాధన కోసం ఎల్లవేళలా కృషి చేయడమే ఆయనకు అందించే నివాళలన్నారు. జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ ఇప్పటివరకు సాధించుకున్న ప్రతి ఒక్కటి కూడా పోరాడి సాధించుకున్నవేనని, నేటి తరం పోరాటాలకు దూరమవుతున్న క్రమంలో చాలా స్పష్టమైన పోరాటాలతోనే సమస్యల సాధన అనే అవగాహనతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బాజీఖాన్, సురేష్ కుమార్, విజయ్, శ్రీధర్, సురేందర్, సాయి, సాయికృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఇస్లాంబిన్ హసన్ కోరారు. కలెక్టర్‌కు దివ్యాంగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అలింకో సంస్థ ద్వారా నిర్ధారణ అయిన దివ్యాంగులకు సహాయక పరికరాలు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని సామాజిక పెన్షన్ బ్యాంక్ అకౌంట్ ద్వారా పంపిణీ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జిల్లా ఆర్పిడి-2016 చట్టం కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగ హక్కుల పోరాట సమితి నాయకులు రాజయ్య, శ్రీనివాస్, తాజ్, మొండయ్య పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ పటిష్టం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

వన్‌నేషన్, వన్ ఎలక్షన్‌తో ఆర్థిక వ్యవస్థ పటిష్టం అవుతోందని జిల్లా కోన్వీనర్ వీరభద్ర చారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌లో భాగాంగ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక వల్ల ఎన్నికల ఖర్చు తగ్గి, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పటిష్టంగా ఉంటుందన్నారు. ఒక్కో రాష్ట్రానికి, ఒక్కొక్క సారి ఎన్నికలు ఉండడం వల్ల పరిపాలన సజావుగా సాగడం లేదన్నారు. అందుకే ప్రభుత్వ అధికారులు కూడా విధులు సక్రమంగా నిర్వహించలేక పోతున్నారని, ఈ విషయాన్నీ అన్ని వర్గాల వారికి, మేధావులు, ఉద్యోగులకు తెలియజేసీ మద్దతు కూడగట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్ములే మల్లయ్య, మండల అధ్యక్షులు డోకె రామన్న, సత్పుత్యే తుకారాం, చప్లే సుధాకర్, పురుషోత్తం చారి, దుబ్బుల మురళీ, కతెర్ల బిమేష్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్వాయి అభిమానులు పాల్గొన్నారు.

జిల్లా పరిధిలోనే శిక్షణా తరగతులు నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల ప్రకారం నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఏప్రిల్ 3, 4 తేదీల్లో శిక్షణ తరగతులు ఆయా జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్నామని ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా పరిధిలోనే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయకులు ఏటుకూరి శ్రీనివాస్, సునార్కర్ అనిల్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పల నరసింహాచారి కోరారు. కుమురం భీం జిల్లా ఉపాధ్యాయులకు గణితం, జీవ శాస్త్రం మంచిర్యాలలో, ఇంగ్లీష్, భౌతిక రసాయన శాస్త్రం ఆదిలాబాద్‌లో నూతనంగా పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారన్నారు. ఫలితంగా ఉపాధ్యాయులు దూరప్రాంతంలో వెళ్లి శిక్షణ తీసుకోవాల్సి వస్తుందన్నారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఆయా జిల్లా పరిధిలోనే శిక్షణా తరగతులు నిర్వహించాలని, ఆసిఫాబాద్‌లోనే అన్ని సబ్జెక్టులు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ రైల్‌లో అత్యాచారానికి గురై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి సోమవారం పరామర్శించారు. బాధితురాలికి అండగా ఉంటామని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ వారిని అభినందించి మాట్లాడుతూ 8వ తరగతికి చెందిన నిశ్విత్, కార్తికేయ, మనితేజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 27 నుండి 30 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జైపూర్



జనవరి 31న రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడు గడ్డం శివ సాయికి వైద్య అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఎస్టీపీపీ అధికారులతో పాటు క్రికెట్ క్రీడాకారులు సమకూర్చిన రూ.66 వేలు సోమవారం ఎస్టీపీపీ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు అందజేశారు. కాంట్రాక్టు కార్మికుడిగా మాత్రమే కాదు మంచి క్రికెట్ ఆటగాడిగా శివ సాయికి గుర్తింపు ఉన్నది. రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు తెలియగానే క్రికెట్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీ పంతులా(డిజిఎం), కోఆర్డినేటర్లు పీవీ బ్రహ్మం(డిజిఎం), పులి సురేష్(సేఫ్టీ ఆఫీసర్), చొరవ తీసుకొని క్రీడాకారులు, ఉద్యోగుల నుంచి ఈ మొత్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కోఆర్డినేటర్ డి పంతులా(డిజిఎం) ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, ఏజీఎం(సివిల్) కెఎస్ఎస్ ప్రసాద్, ఏజిఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అజ్మీరా తుకారాం, డీజీఎం పివి బ్రహ్మం పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు

నవతెలంగాణ-మంచిర్యాల



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీదర్‌లో దొంగ నోట్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ ఉందని రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆ నకిలీ నోట్లనే ఓటర్లకు బీఆర్ఎస్ నాయకులూ పంపిణీ చేశారని అబద్ధపు ఆరోపణలు చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అంకం నరేష్, శ్రీరాముల మల్లేష్, అక్కూరి సుబ్బన్న, మేరుగు పవన్, బేర సత్యనారాయణ, పంబాల ఎర్రయ్య, పెరుమల్ల జనార్దన్, కుమ్మం రాజేశ్వర్‌రెడ్డి, కొండపర్తి శంకర్, కాటంరాజు, మహమ్మద్ సాజిద్ పాల్గొన్నారు.

విక్రయించిన అసైన్డ్ భూమి స్వాధీనం

నవతెలంగాణ-తాండూర్



పేదలకు అసైన్డ్ చేసిన భూమిని కొనుగోలుదారుల వద్ద నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాండూరు శివారులోని సర్వే నంబర్ 669/1 లోని 1.20 విస్తీర్ణం గల భూమిని ప్రభుత్వం 2007లో కాదసి విమల పేరున అసైన్మెంట్ పట్టా ఇచ్చింది. రెవెన్యూ రికార్డులు తెలిపిన వివరాలన ప్రకారం.. ఆ భూమిని విమల నుంచి అసైన్డ్ నిబంధనలకు విరుద్ధంగా శోభ కొనుగోలు చేయగా 2018లో పాస్ బుక్కులు మంజురయ్యాయి. ఫిర్యాదుదారులు కేదాసి విమల కుమార్తెలు కేదాసి అభిలా తాము ప్రభుత్వం ఇచ్చిన భూమిని అమ్మలేదని యాంగరు శోభా మోసం చేసి పట్టా మార్పు చేసుకున్నారని దరఖాస్తు చేసింది. అసైన్మెంట్ రూల్స్ ఉల్లాంఘన ప్రకారం శాంతి భద్రతల దృశ్య అసైన్డ్ చేసిన భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆక్రమణకు అడ్డుకట్ట

తన ఇంటిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు సుమన్ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నారని బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామానికి చెందిన బాకం సత్తెమ్మ భూ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసిల్దార్ జోత్స్న పోలీస్ అధికారులతో బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించి సమస్యను సామరాస్యంగా పరిష్కరించారు.

పది పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్ మండల కేంద్రంలో గల ఆక్స్‌ఫర్డ్ సింగరేణి ఉన్నత పాఠశాలలు, తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. 3వ రోజు ఆంగ్ల పరీక్షకు 9 వేల 177 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 156 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, గతంలో అనుత్తీర్ణులైన వారు 31 మంది హాజరు కావలసి ఉండగా 24 హాజరయ్యారని, మొత్తంగా 99.70 శాతం హాజరు నమోదైదని తెలిపారు.

భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామంలోని సర్వే నెంబరు 18లో గల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆ గ్రామానికి చెందిన కొందరు రైతులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 18లో గల భూమి మా తాత ముత్తాతల నుంచి వారసత్వంగా చేస్తున్న భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వలన మా తండ్రి నుండి మాకు పట్టా కావడం లేదని అన్నారు. గతంలో ఇట్టి విషయంపై ఆర్డీఓకు వినతి పత్రం అందజేయగా, మండల తహసీల్దార్ సిబ్బందిని పంపి విచారణ చేపట్టగా నిజమని తేలిందని అన్నారు. సంవత్సరం గడిచిన కాని ఇప్పటి వరకు ఎలాంటి స్పందనలేదని భూమిని నిషేధిత జాబితాలను తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో ఓరగంటి దుబ్బయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, సత్తయ్య, రమేష్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతులు

నవతెలంగాణ-జైపూర్



పోలీసుల పని తీరు ఆధారంగా పదోన్నతి లభిస్తుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం కమీషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో పదోన్నతలు పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐగా పదోన్నతి చిన్హం అలంకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులకు పదోన్నతులతోనే గుర్తింపు, ఉత్సాహం వస్తుందని తెలిపారు. పోలీసు శాఖలో పదోన్నతుల ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాతో నిర్వరిస్తూ ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంచాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన వాసాల అరవింద్ ఈ నెల 19న కరీంనగర్ కాకతీయ కెనాల్‌లో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ పద్మశాలి ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేష్, ప్రధాన కార్యదర్శి అల్ప భద్రయ్య, ఆర్థిక కార్యదర్శి దూడం శ్రీనివాస్‌లు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు, బాధిత కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ అధ్యక్షుడు శెట్టిపల్లి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రమేష్, రాజమౌళి, భాస్కర్, వేణు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఇందారం-1ఏ, ఉపరితల గని ప్రాంతంలో అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గని మేనేజర్ అనుమతి లేకుండా హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ మీటింగ్ నిర్వహించి ఆ మీటింగ్‌లో అండర్ మేనేజర్లు, అధికారులపైన అనుచితంగా మాట్లాడి వాళ్ళ మనోభావాలు దెబ్బతీశారని అన్నారు. ఇలా అనుమతి లేకుండా ట్రేడ్ యూనియన్ లీడర్లు ఇష్టం వచ్చినట్టు అధికారులపైన ప్రవర్తిస్తే మేము మా విధులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నామన్నారు. కాబట్టి దీనిపై తగు చర్య తీసుకుని వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పని చేసుకునే వాతావరణం కల్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ అపెక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏవీ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మహేష్ కుమార్, కిరణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ భీమన్న, ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

నవతెలంగాణ-జన్నారం

సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్ఐ రాజవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని లింగాయపల్లిలో ప్రజలకు సీసీ కెమెరాలు ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

వసూళ్ల మంచిర్యాలగా మార్చారు

- పీఎస్ఆర్ ట్యాక్స్ అమలవుతోంది..
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు విమర్శ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మంచిర్యాల

నియోజకవర్గంలో పీఎస్ఆర్ వసూళ్లు ఎక్కువయ్యాయని, మంచిగ ఉన్న మంచిర్యాల ను వసూళ్ళ మంచిర్యాలగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మార్చరని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలు వస్తువులు, సేవలపై పన్ను జీఎస్టీ రూపంలో చెల్లిస్తే నియోజకవర్గంలోని ప్రజలు మాత్రం ప్రేమ్‌సాగర్ పన్ను (పీఎస్‌టీ) చెలిస్తున్నారని విమర్శించారు. ప్రేమ్‌సాగర్ రావు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, వ్యాపారులు, ఉద్యోగులు, రియల్టర్లతో సహా సమాజంలోని కుల సంఘాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్ల చేస్తున్నారని ఆరోపించారు. దీనితో మంచి మంచిర్యాల కాస్త వసూళ్ల మంచిర్యాలగా మారిందన్నారు. గత సంవత్సరం నుంచి ప్రేమ్ సాగర్‌రావు చేస్తున్న ఆగడాలను చూస్తుంటే బాధ అనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమర్ మియా వెల్ఫేర్ సొసైటీకి చెందిన 60 మంది సభ్యులు ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేకు రూ.6 లక్షలు చెల్లించారని, ఐడీఓసీ సమీపంలోని ఇండ్ల స్థలాల యజమానులు ఎమ్మెల్యేకు రూ.కోట్ల డబ్బు ఆఫర్ చేశారని, ప్రేమ్‌సాగర్ రావు పట్టణంలోని వ్యాపారుల నుంచి రూ.40 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో ఏర్పాటైన వెంచర్ల యజమానులు నుంచి ఆయన భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని దుయ్యబట్టారు. బైపాస్ రోడ్డు, బెల్లంపల్లి చౌరస్తా, తిలక్‌నగర్ ఇతర ప్రదేశాలలో ఉన్న వివాదాస్పద ఆస్తులను ప్రభుత్వ భూములను గూండాల సహాయంతో కబ్జా చేశాడని, రూ.10 లక్షల కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారని స్పష్టం చేశారు. ఇటిక్యాల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి అనే నెపంతో రూ.రెండు కోట్ల వసులు చేశారని చివరికి స్మశానసవాటిక మెయింటెనెన్స్‌కు మార్వాడి, వైశ్య సంఘం, బంగారు దుకాణదారులంత నెలకు రూ.లక్ష ఇవ్వాలని చెప్పడంతో వారు భయభ్రాంతులకు గురై ఒప్పుకున్నారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.365 కోట్లు

- మీట్ ది ప్రెస్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

నియోజకవర్గ అభివృద్ధికి 14 నెలల్లోనే రూ.365 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేశానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. సోమవారం విలేకరులతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరుతోపాటు వివిధ రంగాల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. చిరస్థాయిగా నిలిచే దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నానని వివరించారు. తాండూర్, నెన్నల, వేమనపల్లి మండలాల్లో జూనియర్ కళాశాలల మంజూరు చేశామని పేర్కొన్నారు. అటవీశాఖ అడ్డంకులు తొలగించి బుగ్గ దేవాలయానికి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుకు కృషి చేశానని అన్నారు. రూ.61.50 కోట్లతో అమృత పథకం ద్వారా బెల్లంపల్లి పట్టణ ప్రజలకు గోదావరి నీరు అందించనున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్ల సౌకర్యం కోసం ఐటీడీఏ ద్వారా రూ. కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.15 కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్ల పనులు సాగుతున్నాయన్నారు. రూ.15 కోట్ల ఎంఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. సీఆర్ఆర్, ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.10 కోట్లు ఖర్చు చేయనున్నామని అఅన్నరు. రూ. 21 కోట్ల ఈజీఎస్ నిధులతో నియోజకవర్గంలోని మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.8.91 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిర్మాణాల కోసం రూ.4.78 కోట్లు ఖర్చు చేశామన్నారు. అంగన్‌వాడీ భవనాలకు రూ.రెండు కోట్లు, కస్తూర్బా గురుకులాల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ.5.55 కోట్లు, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.1.36 కోట్లు, మేనేజ్మెంట్ రోడ్లకు రూ.1.10 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

ప్రగతి పనుల ప్రతిపాదనలు..

తాండూరు మండలంలో 200 పడగల సామర్థ్యం గల ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బెల్లంపల్లిలో డిపో నిర్మాణం పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలుగా అప్ గ్రేడ్ చేసేందుకు ఆయా మంత్రిత్వ శాఖల అనుమతులు కోరినట్లు తెలిపారు. బెల్లంపల్లిలో ఐటీఐ కళాశాల మంజూరుకు ప్రతిపాదనలు పంపమన్నారు. మామిడి మార్కెట్ ఈ సంవత్సరం ప్రారంభించే విధంగా అధికారులను ఆదేశించినట్లు వివరించారు. మామిడి మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సీనియర్ విలేకరులు ఎమ్మెల్యేను కోరారు. ఎన్నో ఏండ్లుగా మీడియా రంగంలో కొనసాగుతూ విలేకరులు దారిద్రరేఖకు దిగువన జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనైనా జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను ప్రాధేయపడ్డారు. ప్రత్యేక దృష్టి సారించి నిబంధనల ప్రకారం న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కారకూరి రామచందర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

కార్మికులను వేధించడం మానుకోవాలి

- హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్



ఇందారం-1ఏ గని కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న హెచ్ఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1ఏ అధికారుల తీరులో మార్పు రావాలని, కార్మికులను వేధించడం మానుకోవాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటి నాయకులు తిప్పారపు సారయ్యతో కలిసి సోమవారం ఇందారం-1ఏ గని సంధర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గని కార్మికుల చర్యలతో కార్మికులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రతి చిన్న విషయానికి సైతం చార్జిషీట్లు ఇవ్వడం పరిపాటిగా కొనసాగుతున్నట్లు కార్మికులు వెల్లడించారు. పని స్థలాల్లో ఇబ్బందులు ఉన్నప్పటికీ 15 రూఫ్ బోల్టులు వేసినా బెదిరింపులు తప్పడం లేదని కార్మికులు ఆవేధన వ్యక్తం చేశారు. మ్యాన్ రైడింగ్ కార్మికులను ఇతర పనుల్లో వినియోగించడం, అర్హత లేనటువంటి అధికారులు ఆకస్మిక తనిఖీల పేరుతో చార్జిసీట్లు, బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇందారం-1ఏ గనిలో కొంత మంది అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గని మేనేజర్‌ను తప్పుదోవపట్టించడం, సమస్యలపై ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. మ్యాన్ రైడింగ్ నెమ్మదిగా నడపడం ద్వారా భూగర్భంలోని కార్మికులు ఉపరితలానికి చేరుకోవడం ఆలస్యం అవుతుందని కార్మికులు ఆవేధన వ్యక్తం చేశారు. గని ప్రమాదాలు జరిగినప్పుడు విచారణ పేరుతో కార్మికులను వేదిస్తుండటం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కాగా గని కార్మికుల సమస్యలను సానుకూల దృక్పదంతో చూడాలని, కార్మికులను వేదించడం ఎంత మాత్రం సరికాదని హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఉత్పత్తి ఉత్పాదకత, రక్షణ చర్యలపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి పొన్నగంటి అశోక్, మీసా కొమురయ్య, పిట్ కార్యదర్శి ఎర్రంశెట్టి సాయికుమార్, నాయకులు దుర్గం లక్ష్మన్, చెవుల శ్రీనివాస్, కార్యకర్తలు, గని కార్మికులు పాల్గొన్నారు.

పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

నవతెలంగాణ-జైపూర్

పోలీసు అధికారులు, సిబ్బంది విధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సోమవారం కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్లను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించిన ఆయన ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలు, గ్రామీణ ప్రాంతాల్లో గల సమస్యలు, మావోయిస్టుల కదలికలు, సానుభూతిపరులు, మిలిటెంట్స్ సంబంధిత విషయాలపై అక్కడి సీనియర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పిర్యాదుల వివరాలు రిసిప్షనిస్టును అడిగి తెల్సుకోవడంతో పాటు బాధితులతో మర్యాదగా మసలుకోవాలని సూచించారు. బాధితులకు భరోసా, నమ్మకం కలిగే విధంగా వ్యవహరించి చట్టం పరిధిలో వారి సమస్యకు పరిష్కారం చూపించాలని సూచించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెల్సుకోవడంతో పాటు విధుల్లో ఎలాంటి సమస్యలున్నా నేరుగా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎస్ఐబీ ఇన్స్‌పెక్టర్ కర్ణాకర్, చెన్నూర్ రూరల్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.



వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-మందమర్రి



కేకే ఓసీపీలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కార్మికులకు అవగాహన నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఎండలో ఎక్కువసేపు తిరుగవద్దన్నారు. నీరు ఎక్కువ తీసుకోవాలని శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, నిమ్మరసం పండ్ల రసాలు తాగాలని సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు. వేపుడు పదార్థాలు తినవద్దని మద్యపానం మాంసం తగ్గించాలని ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు బీపీ ఉన్నవారు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, కేకే ఓసీపీ మేనేజర్ రామరాజు, ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రాజేష్ కుమార్ యాదవ్, సంక్షేమ అధికారి సందీప్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6016 పింఛన్ పెంచుతామని ఇచ్చి హామీని అమలు చేయాలని తెలంగాణ దివ్యాంగుల ఐక్య వేదిక అధ్యక్షుడు నగురారపు సుమన్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో తెలంగాణ దివ్యాంగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినతిపత్రంలో దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, 40 శాతం వైకల్యం కలిగిన ప్రతి దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డు జారీ చేయాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో విద్యాంగులు దరఖాస్తులు చేసుకోకుండా చేసిన వైఖరి మానుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వికలాంగుల కూడా దరఖాస్తులు చేసుకునేలా వెసులు బాటు కల్పించాలని కోరారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చూపకుంటే పరిష్కారం అయ్యే వరకు దీక్షలు చేపడుతామని తెలిపారు.

టీజీబీ ఆధ్వర్యంలో బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కిష్టాపూర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 లక్షల ప్రమాద భీమా చెక్కును బాదిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ప్రమాదవశాత్తు సెప్టెంబర్ నెలలో మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన అజ్మీర రాంసింగ్ మంరణించడంతో ఆయన కుటుంబానికి చెక్కును అందజేశారు. ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టాపూర్ గ్రామీణ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉండి ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ రూ.500 కట్టడం వలన మృతుని కుటుంబానికి రూ.పది లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఖాతాదారులు ఇన్సూరెన్సులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్‌తోపాటు ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సమీర్, ఏపీఎం బుచ్చన్న, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కిష్టాపూర్ శాఖ మేనేజర్ రమాణ చైతన్య పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై సదస్సు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఒకే దేశం ఒకే ఎన్నికపై బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల కృష్ణదేవరాయులు హాజరై మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహించుకోవడం వల్ల ఆర్థిక వ్యవస్థకు నష్టం జరగదన్నారు. దేశం మరింత అభివృద్ధిలోకి వెళ్లడానికి అవకాశం ఉంటుందని, ఓటింగ్ శాతం పెరగడానికి అవకాశం ఉంటుందని, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పెద్దపల్లి శంకర్, దేవునూరి సంతోశ్, ప్రధాన కార్యదర్శి రెడ్డి బాల రాజు, చారులత, కార్తీక్, ప్రిన్సిపాల్ అబ్దుల్, ఉపాధ్యాయులు వర్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. చెన్నూర్ మండలం సుద్దాల, గంగారం, ఎర్రగుంట పల్లి, కొమ్మెర, పొక్కూర్, కోటపల్లి మండలం రాంపూర్‌లలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రధాన్యతాక్రమంలో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

మహిళా రైతులు పని ముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మహిళా రైతులకు రాయితీపై పని ముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎస్ఎంఏఎం పథకం (ఆర్ కేవీవై పథకం) ద్వారా రాయతీపై మహిళా రైతులు పని ముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్-4, రోటోవాటర్స్-2, ఎంబీ ప్లగ్, కల్టివేటర్స్, కేజ్ వీల్స్ 3, విత్తనాలు విత్తే యంత్రం 1 అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 26వ తేదీ వరకు ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకోవడానికి దరఖాస్తు పత్రంతో భూమి పాస్ బుక్, ఆధార్, ట్రాక్టర్ సంబంధిత పని ముట్లకు ట్రాక్టర్ ఆర్సీ జత చేయాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com

ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలో ఆమ్ ఆద్మీ ఆధ్వర్యంలో సయ్యద్ హైదర్ అధ్యక్షతన ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కామారెడ్డి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి, ఈజీపీ షబానా బేగం హాజరు కాగా పార్టీ తరపున శాలువాతో సన్మానించారు. ఈ విందులో పలువురు స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి సుభాష్, జిల్లా చైర్మన్ శ్రీనివాస్, సహచట్ట పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, సోఫి ఇలియాజ్, భైంసా డివిజన్ కార్యదర్శి హుజూర్ అలీ, అబ్దుల్ సాధిక్, జహీర్ హైమద్, మొగిలిరాజు, సాజిద్, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.



నాటు స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని లంబడిగూడ, ముంజంపల్లి, బారెగూడ గ్రామాల్లోని నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 25 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం పట్టుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. తదుపరి పాత నేరస్తులు 9 మందిని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ఐ.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో పారిశుధ్య కార్మికులుకు సోమవారం బీజేపీ సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు 64 మంది కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల కృషి చాల కీలకమన్నారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ, కోట వెంకన్న, శ్రీకాంత్, జయరాజ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ సంగీత అధ్యక్షత వహించగా టీజీటీడబ్ల్యూ ఆర్డీసీ రిసోర్స్ పర్సన్ భార్గవి, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ లాంగ్వేజ్ వచ్చే ఇంటర్వ్యూ ప్రశ్నలసరళి పై విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం భార్గవి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో వైస్‌ప్రిన్సిపల్ జగ్‌రాం, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ అధ్యాపకులు నారాయణ, రామ్‌కిరణ్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న గాదిగూడ, ఉట్నూర్, నార్నూర్, జైనూర్ మండలాలకు చెందిన బాధితులను పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, ఆదివాసి నాయకులు ఆత్రం వెంకట్ ఉన్నారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయ్యాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ఇథనాల్ ఫ్యాక్టరీ ఉద్యమంలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీజేపీ శాసనసభ పక్షనేత నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీలో ఈ మేరకు మాట్లాడుతూ నిర్మల్ జిల్లా దిలవార్పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల గ్రామంలో ప్రజలకు, పంటపొలాలకు ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారన్నారు. రైతు ఉద్యమానికి ప్రభుత్వం దిగివచ్చి ఫ్యాక్టరీని రద్దు చేస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. కానీ ఈ ఉద్యమంలో పాల్గొన్న మహిళలు, రైతులు, గ్రామ ప్రజలపై పోలీసులు కేసులు నమోదు చేశారని, తక్షణమే ఆ కేసులను కొట్టివేయాలన్నారు.

28న సంతల వేలంపాట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపాలిటీ పరిధిలో వార, దినసంత, పశువుల సంత కోసం ఈ నెల 28వ తేదీన మున్సిపాలిటీ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భుజంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనదలచినవారు ఈనెల 24 నుంచి 27వ తేదీ లోపు రూ.50 వేల ధరావత్తు సొమ్ము డీడీ లేని పక్షంలో నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం పాటను అనివార్య కారణాలతో వాయిదా వేసే అధికారం కమిషనర్‌కు ఉంటుందని పేర్కొన్నారు.


మూడోసారి వేలం వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీ రాజంపేటలో 3వ సారి దిన సంత వేలం పాట నిర్వహించాల్సి ఉండగా ఏ ఒక్కరు కూడా వేలం పాటకి డిపాజిట్ చేయనందున వాయిదా వేశారు. తిరిగి ఈనెల 26న గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందని పంచాయతీ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

కామర్స్ ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. దీనికి ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. అనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీకామ్ తర్వాత అందుబాటులో ఉన్న విద్య, ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ శివకృష్ణ, కామర్స్ అధ్యాపకులు ప్రీతం రాజు, గణేష్, జితేందర్ అనితను సన్మానించారు.

గోడు వినండి..సమస్య పరిష్కరించండి..!

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా
- 99 మంది నుండి అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారమయ్యేది, కానిది వెంటనే తెలియజేయాలని, కార్యాలయాల చుట్టూ తిరగకుండా అర్జీదారుడికి సమస్య పై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దాదాపు 99 అర్జీలు స్వీకరించ తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఇందులో రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

మా కాలనీలో టవర్ నిర్మాణం వద్దు



పట్టణంలోని జూబ్లీహిల్స్ కాలనీలో టవర్ నిర్మాణం ఏర్పాటు చేయొద్దని ఆ కాలనీ వాసులు ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. జీఓ నెం.5 ప్రకారం పాఠశాలలకు, దేవాలయాలకు, నివాస ప్రాంతాల సమీపంలో టవర్ నిర్మాణం చేపట్టొద్దని అన్నారు. టవర్ నిర్మాణం ఆపాలని ధర్నాలు ఆందోళనలు చేపట్టామన్నారు. చివరకు టెంట్ వేసుకొని సమ్మె కూడా చేశామన్నారు. అయిన సరే అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. నిర్మాణం చేయొద్దని కోర్టు నుండి ఆదేశాలు ఉన్న టవర్ యజమానులు పట్టించుకోకుండా నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు.

నీటి సమస్యను తీర్చండి సార్



నీటి సమస్యను తీర్చాలని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ సోమవారం అర్జీ సమర్పించారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డులలో తాగునీటి సమస్య రోజురోజుకి పెరుగుతోందన్నారు. లీకేజీలకు సైతం మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. ఇందిరమ్మ కాలనీలో వీధి కుక్కలు ప్రజల పైన దాడి చేస్తున్నాయని కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు. పురపాలక సిబ్బంది కుక్కలు పట్టే వాళ్లు ఒక వీధిలో పట్టుకొని వేరే వీధుల్లో వదిలేస్తున్నారని ఆరోపించారు. అలా కాకుండా కుక్కలను ఊరు బయట వదిలేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జొన్న కొనుగోలు ప్రారంభించండి



జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 15 నుండి ప్రారంభించాలని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామస్తులు ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. గ్రామంలో యాసంగి పంటగా సుమారు వెయ్యి ఎకరాల్లో జొన్న పంటను వేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంట కోత దశలో ఉందని, కొందరు రైతులు ఇంకా పంటను కోయలేదన్నారు. ఏప్రిల్ 15 నాటికి అందరి పంటలు కోతకు వస్తాయని అప్పుడే జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. గతేడాది ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారని, దీంతో మిగతా పంటను ప్రైవేటులో అమ్ముకుని నష్టపోవాల్సి వచ్చిందని కలెక్టర్‌కు వివరించారు.

శ్మశాన వాటికలో పనులు చేపట్టండి



మావల మండలంలోని బట్టిసావర్గాం గ్రామంలో స్మశాన వాటిక నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయి అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ఆరేండ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ఓ కంట్రాక్టర్‌కు అప్పజెప్పగా కంట్రాక్టర్ నాణ్యత పాటించకుండా ఒక టీన్‌షెడ్, ఫౌండేషన్ నిర్మాణం, సిమెంట్ పోల్స్‌తో ఫెన్సింగ్ చేసి పనులను మధ్యలో నిలిపివేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం పోల్స్ విరిగిపోయి, చిందర, వందరగా తయారైనట్లు అర్జీలో పేర్కొన్నారు. వెంటనే నిర్మాణం పూర్తి చేయించాలని, స్మశాన వాటికలో నీటి వసతి, కరెంటు వసతి కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

సస్పెన్షన్ ఎత్తి వేయండి సార్..!



బజారత్నూర్ మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు వండర్ లా టూర్‌లో అసభ్యకరంగా ఫోటోలు దిగారని కలెక్టర్ ముగ్గురు ఉపాధ్యాయులను ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఉపాధ్యాయుల తప్పేం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి అర్జీ సమర్పించారు. ఆ ఫోటోలు వైరల్ అయ్యాయని, తాము ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. సస్పెన్షన్‌తో విద్యార్థులు మనస్తాపానికి గురవుతున్నారని వాపోయారు. పునరావృతం కాకుండా చూసుకుంటామని, మరొకసారి విచారణ చేపట్టి వారిని విధుల్లో తీసుకోవాలని కోరారు.

గోనె స్వామి కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఖానాపూర్ మండలంలోని రంగాపేట్ కొత్తగూడెంలో గోనె స్వామి కుటుంబ గుడిసెను కూల్చిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదుట 8 రోజులుగా నిరవధిక ధర్నా చేపడుతున్నామన్నారు. సమస్యలను తీర్చాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. సమస్య పరిష్కరించేంత వరకు ధర్నా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, జిల్లా నాయకులు గోపి నర్సయ్య, ఖానాపూర్ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గూట్ల ప్రసాద్, గోనె స్వామి, గ్రామ కార్యదర్శి గోగు శేఖర్, మచ్చ కైలాస్, గోగు భూమక్క, గూట్ల గంగాధర్, లింగాల శంకర్, గోనే రాజేశ్వర్, ఆడే గణేష్, నైతం లింగుబాయ్, గోగు భూమక్క, బోగిడి సునీత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-దహెగాం

ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా జిల్లా కమిటీ సభ్యురాలు కుందరపు మంజుల అన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా మండలంలోని హత్తిని గ్రామంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు కుందరపు మంజుల మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనేక రక్షణ చట్టాలు ప్రభుత్వాలు చేస్తున్న వాటిని పకడ్బందీగా అమలు చేయలేకపోతుందన్నారు. నేటి సమాజంలో మహిళలు వంటింటికే పరిమితం అవుతున్నారని, విద్యా, రాజకీయపరంగా ఆర్థికంగా అనేక విషయాలలో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి శ్రేయస్సుకు దృష్టించాలన్నారు. అనచివేతకు గురవుతున్న వర్గంలలో మహిళ వర్గం ఒకటి అన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు అమ్ములు, సింధు, ఇందు, లతా, సందీప్, తిరుమల, భీమేష్, పూజ, అక్షయ, బిందు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్యా, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా అధికారులందరూ సమయానికి ప్రజావాణికి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణి రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగి ఉన్న ప్రజలందరికీ సన్నబియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్, అధిక ఉష్ణోగ్రతల కారణంగా, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటిని నమోదు చేసుకొని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారం కొరకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం పండరి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పండరి సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్టీసీ పనితీరు, బస్టాండ్ పరిశుభ్రత, మహాలక్ష్మి పథకం, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందించాలని సూచించారు. అనంతరం ఎస్పీ జానికి షర్మిలను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ఐ.రాజశేఖర్ ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను రైతుల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారని వెంటనే పదవి నుంచి తొలగించాలని జైనథ్ మండల మాజీ ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్ సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. శనగ కొనుగోళ్లలో డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు గురి చేస్తున్న, అవినీతికి పాల్పడిన సదరు చైర్మన్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి స్పందించాలన్నారు. ఇందులో నాయకులు భోజన్న, అశోక్, సురేష్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 4 మేకలు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్



కుక్కల దాడిలో 4మేకలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బెజ్జూరు గ్రామానికి చెందిన కావిడ బక్కయ్యకు చెందిన మేకలు ఇంటి సమీపంలో పెరట్లోకట్టేసి ఉండగా రాత్రి వేళలో కుక్కలు దాడి చేసి మేకలను చంపేసినట్లు యజమాని బక్కయ్య తెలిపారు. సుమారు రూ.40,000 ఆర్థిక నష్టం జరిగిందన్నారు. పిచ్చి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డేవాచ్ ఉమెన్‌ను నియమించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో డే వాచ్ ఉమెన్‌ను నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ బాలికల వసతి గృహంలో 6 నెలలుగా డే వాచ్ ఉమెన్ లేరని, దీంతో విద్యార్థుల, హాస్టల్ బాగోగులు చూడటానికి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ఎలాంటి అవసరాలు ఉన్న చెప్పుకవడానికి వాచ్‌ఉమెన్ లేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. ఉన్న ఒక వాచ్‌ఉమెన్‌ను నైట్ డ్యూటీ చేస్తున్నారని, ఇక్కడ పని చేస్తున్న మరో వాచ్‌ఉమెన్ కలెక్టర్ కార్యాలయంలో విధులు చేపడుతున్నట్లు తెలిసిందన్నారు. బాలికల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హాస్టల్‌కు డే వాచ్‌ఉమెన్‌ను నియమించాలన్నారు. ఇందులో జిల్లా నాయకులు అయ్యూబ్ ఖాన్, విలాస్ పాల్గొన్నారు.

కల్లు బట్టి తొలగించాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ సరిహద్దులోని తంతోలి రోడ్డు మార్గంలో డబ్ల్యూ కన్వెషన్ హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ లే అవుట్‌లో అక్రమంగా కల్లుబట్టి నడుపుతున్నారని బట్టి సమీప కాలనీవాసీ జీ.మహేష్ పేర్కొన్నారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుని బట్టిని అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించాడు. పట్టణ సరిహద్దు కావడంతో పెద్ద మొత్తంలో యువత అక్కడికి వచ్చి, కల్లు, ఇతర మత్తు పదార్థాలు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తాగిన మైకంలో గొడవలు జరుగుతున్నాయని, జనవరి నెలలో బట్టిలో గొడవ జరుగగా రూరల్ పోలీస్ స్టేషన్లో పలు సెక్షన్ కింద కేసు నమోదు చేశారని, కానీ ఆ కల్లు బట్టి నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో అనేక మార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పోలీసులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు తెలిపాడు. ఈ కల్లుబట్టితో యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అనుమతి లేని కల్లుబట్టిని వెంటనే మూసి వేయించాలని అభ్యర్థించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

ప్రతి నిరుద్యోగికి రుణాన్ని అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజన్సీ ప్రాంతంతో పాటు మైదాన ప్రాంతాంలో అర్హత గల ప్రతి ఆదివాసీ పర్ధాన్ నిరుద్యోగికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపచేసి రుణాన్ని అందించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు సెడ్మకి సుభాష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు లేక సంక్షేమ పథకాలు అందక చాలా మంది ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2018-2021 సంవత్సరంలో మంజూరైన రూ. 380 కోట్లు ట్రైకార్‌తో సంబంధం లేకుండా యధావిధిగా మంజూరు చేయాలన్నారు. కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోని తమ సమాజంలోని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ నాయకులు మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, సాయి, సచిన్ ఉన్నారు.